ప్రాణంవెల

మూడురోజులాయె. ముసిరిముసిరి కురుస్తోంది వాన. గడపలోకాలు బయటపెట్టేందుకులేదు. ఒకటే ముసురు. చుట్టూ ప్రపంచమంతా తడిసిముద్దయికూచుంది. చెట్లన్నీ యీ వానకి తలారాస్నానాలుచేసి పచ్చగానిల బడ్డాయి.

ఈవురుమంటూ ఒకటేచలిగాలి. ఎముకల్ని కూడా కొరుక్కుతింటోంది. 'ఆకాశమంతా' తూట్లు పడ్డట్టు ఒకటేపకధార. ఏదేవుడన్నా కాస్తచెయ్యిఅడ్డం వేస్తేబాగుండిపోను. కానిఏదీ? వానేమీాకట్టుబడేట్టులేదు. ఆకాశాన్నంతా కాటుకమబ్బులు యింకాదట్టంగాఅలికి వేస్తున్నాయి. దూరానకొండలమీాదచూస్తే అగుపిస్తాయి. జీమూతాలూ ఎలావడివడిగా కొంపమునిగినట్టు రాచుకు పోతున్నాయో!

మాంచి ముమ్మరంగా ఊడ్పులు సాగాల్సిన రోజులివి. ఇన్నాళ్ళదాకా పనుల్లేక ఇగిరి 'బెకబెకా' మన్న కూలీనాలీ జనమంతాఎదురుచూస్తూకుర్చున్నారు. ఎండిన చెర్లోకప్పల్లాగా – ఇంతలో యీవాన వచ్చిపడింది. ముంచుకుపోయినట్టు. మూడురోజులపాటు కూలీవాళ్ళ

నోళ్ళల్లో ముద్దపడగొట్టింది.

ఇంతతో మాత్రంఅయిందా? ఒకవేళ రేపో మాపో వానఆగినా - నిండి, చెరువుల్లాగా తటాయించుకు కూర్చున్న చేలల్లో మురుగు బయటికి పోవద్దూ? సుయ్యాన మురుగుతియ్యటానికేం కాలువులా? పాడా? ఆ చేలోనుంచి ఆచేలోకి అలాఅలా సాగిపోయి ఏట్లో పడ్డానికి ఎంతకావాలో? ఎన్ని కజ్జాలో? ఎన్నితలలు తగలాలో?

ఇంతకూ పరవళ్లుతొక్కే నాగావళితల్లి పాటున పడాలిగదా! మురుగునంతా తరగదోడుకు పోయేందుకు. ఇదంతాఅయి మళ్లీ పనులుసాగేందుకు పదిరోజులైనాపట్ట కపోనా? ఈపదిరోజులూ పక్షుల్లా నిరాధారంగావున్న పాటకజనమంతా బ్రితికేదెట్లా?

-ఇదే ఆలోచన సింహాద్రికి.

గుర్రిపుపాకాలాంటి చిన్నపాకలో ముణగదీసుకుని కూర్చున్నాడు. వానజల్లూ, చలిగాలీ, రాకండా-అడ్డంవేసిన రెల్లుతడికసందుల్లోంచి బయటప్రపంచాన్ని చూస్తున్నాడు. గోచీమినహా కాసింత గుడ్డపీలికకూడా లేదు. ఒంటిమీద-వణికిపోతున్నాడు.

సింహాద్రికి ఏటిపాడుగూన్నా పడవగడుపుతూండటమేపని. యేటికి అద్దరి యిద్దరిఆసామీలు పంటకళ్లాల

రోజుల్లో తలాకాసిన్ని గింజలూ కొంగులోపోస్తారు. అదంతా సింహాద్రికి రెణ్ణెల్లగ్రాసం. అందుకుగాను సింహాద్రి వారినీ వారిబంధువుల్నీ దమ్మిడీపుచ్చుకోకుండా సంవత్సరాంతమూ ఏరు దాటిస్తూవుండాల.

ఆ రెండునెల్ల గ్రాసానికే ఆఏడంతానావను అంటిపెట్టుకొని వుండటం లాభసాటి బేరమేమీకాదు. అలాఅని యింకేంచేస్తాడు? ఆ గూడెంగూడెం మొత్తం లోనూ ఆ రెండునెల్ల గ్రాసమైనా గ్యారంటీగా దొరికేది సింహాద్రికొక్కడికే. అందుకే అలా ఏప్రొద్దూ ఆనావని కనిపెట్టుకొని పడివుండడం.

దానికితోడు మొగంఎరగని వాళ్ళదగ్గర ఖరా ఖండీగా అణాబేడా వసూలు చేసుకొంటాడు.

ఏటినిండు తగ్గి కాలినడవలు పడ్డాయంటే చేపాజెల్లాపట్టి అమ్ముతుంటాడు. ఎటొచ్చీ ఒక వేసంగుల్లో మినహా ఏకాలమూ కూలికిపోయే పనేలేదు. సింహాద్రికి, ఆకాలంలోనైనా కూలిపనులేముంటాయి? చేయించేందుకైనా రైతులదగ్గర తడివుంటేగదూ! ఏకాస్త చెక్కలోనో రాగులుజల్లితే, మైళ్లకుమైళ్లు నీళ్లుమోసుకొచ్చి పొయ్యలేక చావాయె. ఆచావుపడలేక ఏకాస్త లోనో యింతతిండికి సరిపడా చల్లుకుంటే, వాటికినీళ్ళు ఆలుమగలే చల్లుకుంటారు. యింకా కూలీ నాలీతో యేంపని?

ముసలితల్లీ, తానూ, పెళ్లాం, చంటిపిల్లడూ యీనాలుగు పొట్టలకే యిన్నితంటాలూనూ.

మూడురోజులాయె, ముసురుబట్టి. ఏడురోజులాయె-ఎగువను వానలుకురిసిన కారణంగా త్రుళ్లింతలు పడ్తూ పగబట్టిన తాచులా, పరవళ్లుత్రొక్కుతోంది... నాగావళి. పడవకదిలించే పారంలేదు. వచ్చేపొయ్యే జనం లేరు. అణాడబ్బులు చేతిలో పడిందిలేదు. పొయ్యిలో పొగ లేచిందిలేదు.

ఆ కాసింతపాకా నిశ్శబ్దంతో పేరుకుపోయింది. అంత కుటుంబమూ-నరాలను పెటపెటా నమిలి చప్పరిస్తోన్న ఆకలిబాధని కిక్కురుమనకుండా భరిస్తోంది.

ముసల్ది ఓమూలగా పొయ్యివారనే చింకిగోనె మీదపడి దహించుకుపోతోంది. ఆకలితో ప్రేవులు మెలికలు తిరుగుతున్నాయి. ముక్కులు బుసగొడ్తున్నాయి. కాళ్ళు కొంగర్లు పోతున్నాయి.

సిమ్మాన్నద్రి పెళ్ళాం గైరికి ఏడోనెల-చంటివాడు పాలకు గింజుకొంటున్నాడు. పాలురాక, కసికొద్దీ కొరుకుతున్నాడు. మూడురోజులాయె. ఆహారంఅంటూ లోపటికిపోయి. మూన్నాళ్ళక్రితం ఊదబియ్యం కాచుకు తాగినందుకు విరేచనాలుపట్టుకుని ఝాడించివదిలాయి. గుండెల్లో బాధ సుడులు తిరుగుతోంది. కడుపులోని

మంటలవేడికి, గొంతులో తడి యిగుర్చుకుపోతోంది. పైగా యీ చంటిపిల్లడిబాధ.

"ఒరే! చిమ్మన్నా! యి త్తల తల్లి చత్తాఉం" మూలిగింది ముసిల్ది.

సిమ్మాద్రి వెనక్కేనాతిరిగి చూచాడుకాదు. అసలు విన్పించనేలేదు. అతగానిప్రాణం-చెవిగూబల్లోచేరి 'ఝుం' మంటున్నది. నవనాడులూ క్రుంగిపోతున్నాయి. అతడికీ ఎవరికంటేనూ తక్కువ ఆకలిలేదు. కాని తాను ఎవర్ని అడిగేట్టు, ఎవరిమీద విసుక్కొనేట్టు; ఎవర్ని తిట్టిపోసేట్టు-అలాగే బయటికి చూస్తున్నాడు.

బయట భూమ్మీదికి మెల్లగా చీకటితెర జారుతోంది.

లోపల పాకలోకి సన్నగా చావుపొర పారుకాడ్తోంది.

ఎవరో పళ్లునూరుతున్నట్టుంది. చావబోయే ముసిలిదో; చంపబోయే మృత్యువో? ఒకవేళ చావే అమాంతంగా విరుచుకుపడ్డా, ఒక్కళ్లుగూడా కెవ్వనకేక పెట్టే స్థితిలోలేరు.

—సింహాద్రి యింతప్పట్నుంచీ ఆ నాగావళీ తల్లి ఒడిలోనే పెరిగాడు. తపతపా కాళ్లుకొట్టుకుంటూ, రెపరెపా బారలుచాస్తూ, ఆ నాగావళీ జలాల్లోనే

యీదాడు. తెల్లనివెన్నెట్లో, చిక్కనిచీకట్లో-ఆ నాగావళీ యిసుకశయ్యలమీదే, గోచీయేనాలేకుండా గురకనిద్దర్లు తీశాడు. పెద్దయ్యాక కూడా ఆతల్లి బాహువుల్లోనే మునుగుతూ తేల్తూ 'గజయీతగాడ'నిపించుకున్నాడు. ఆతల్లి చలువలోనే గైరికి (ప్రేమపాతు)డయ్యాడు. ఆపేరుతోనే పడవనడిపేందుకు కుదిరి నాలుగురాళ్లు తెచ్చుకొంటున్నాడు. ఆతల్లితోడుకోసమే వూరునీ వుపాన్నివదిలి దూరంగా నాగావళి ఒడ్డునే చిన్నపాక వేసుకున్నాడు. ఏఒడ్డునుండి, ఏవేళలో పిలిచినా 'ఓ' అంటున్నాడు. కాని—

తానుపిలిస్తే పలికేందుకుమాత్రంలేరు. అంతా ఒక్కసారిగా చచ్చివూరుకొన్నా, రెండోకంటివాడికి తెలీదు.

'ఒకళ్ల చావు ఒకళ్లకి తెలీకుండా అంతా వరుసాగ్గా చావలేదుగదా!'- అలాచస్తే వాళ్లని ఈడ్చిపారేసేందుగ్గానీ; మరొకళ్లని పిలిచేందుగ్గానీ తనకి ఓపికలేదు.

'ఏమిటీ ఆలోచనలు-?'

వాళ్లంతా నిజంగానేచస్తే-? అందుకు బాధ్యత ఎవరిది?

ముసల్ది- మొన్న మొన్న, చూపుపోయేదాకా కూడా, నడుంపట్టుతప్పినా, అలాగే తిరిగితిరిగి ఏకందమూ

లందుంపలో అమ్ముతూనేవుండేది. ఏచాకిడు గింజలో తెచ్చి సంసారానికింత ఎదురువేస్తుండేది. యీదశలో అన్నీ వుడిగి, కాలూచెయ్యీ కదపలేనిస్థితిలో తిండిలేక చస్తే - ఆతిండి పెట్టలేనిలోపం తనదికాదూ? ఆపాపం తనది కాదూ?

గైరిమట్టుకు గైరి. ఏడునెలల్నిండినా యీడ్చుకుంటూనైనాపోయి, ఊడ్పులూడ్చి పావలోపరకో ప్రతి నిత్యమూ చేతలో పెట్టకపోయిందా?

పాలకైనా నోచుకోని ఆగుంటడి మాటేమిటి? ఎల్లానో ఒకల్లా పెంచి పెద్దవాణ్ణిచేసుకొంటేనేగదూ! ముసలితనంలో కాలూ చెయ్యీ ఆడని అవస్థలో యింత ధారకం పోసేందుకు-

వీళ్ళంతా తిండిలేక చచ్చారంటే ఎవరిది బాధ్యత?

"ఆకలితో కాదు చచ్చింది. రోగాలతో" అని ఓస్టేటుమెంటు ప్రపంచమ్మీదికి విసిరేసి, బాధ్యత వదిలించుకొంటున్నారు పెద్దలు. ఆమార్గం తెలియదు సింహాద్రికి. అలాంటి కిటుకులు తెలిసేందుకు - పాపం! ప్రభుత్వంలో పదవులేమీ వెలిగించాడుకాడు సింహాద్రి. ప్రజలకోసమే పడిచస్తానని ఓట్లుపుచ్చుకుని ఒడ్డెక్కినవాడూ కాడూ. మంత్రిగా మారేందుకు మారు మనసుపొందిన వాడూ కాడు. కనీసం పంపమన్నట్టల్లా రిపోర్టు పంపే

కరణమూకాదు; కలెక్టరూకాదు. రెక్కలుండీ ఎగరలేని పక్షి సింహాద్రి.

సింహాద్రికి బలంగా రెండురెక్కలున్నాయి. సింహాద్రి కొక్కడికేయేం? దేశంలో కోటానుకోట్ల కున్నాయి రెక్కలు. ఆరెక్కలన్నీ – డొక్కల్ని పూడ్చుకొనేందుకు ఏమైనాచేస్తాయి. కాని చేసేందుకేదీ? పని–

మన ప్రధానులూ అప్రధానులూ అంతా చేరి పాటికి పదిమాట్లు సోమరితనాన్ని వదలండి. బాగా పని చేయండి'' అని నిత్యమూ రేడియోలల్లో ఉభయ సన్యాసాలు చేస్తున్నారు.

అలాగని సింహాద్రికి తెలియదు. తెలిసివుంటే ఆ రేడియోముందేనా మోకరిల్లి ''పని చూపెట్టండి బాబూ!'' అని ప్రాధేయపడును.

''ఆలికి...ఎదుర్గా...కూసుండి... అందాలు ...సూత్తుంటే... ఆకలి తీరేనీ?'' పెగిల్చి పెగిల్చి నసిగింది. ముసిల్ది–

గైరికి పెళ్లై కాలు గడపలో పెట్టిననాటినుంచీ నేటిదాకా ఒకటే సాధింపు ముసిల్దానికి– ఆ అలవాటే యిందులోనూ–

'తన మనమరాల్ని కట్టుకోకుండా నే నడ్డుపడినానేటి? యిదేటిరా బగమంతుడా! చావుతరవాతకీ లావు దుక్కం' లోపలే గొణుక్కున్నదిగైరి.

'ఏటబ్బా! చావన్నా రాదేమే!' కసుక్కు-మన్నాడు సింహాద్రి.

'అదొస్తే యింకేటికావాలి?' బయటికే అన్నది గైరి.

సిమ్మాద్రి తిరిగిచూచాడు. గైరి కళ్లల్లోకి చూచాడు.

ఎంతమంది వొద్దని మొత్తుకున్నా వినక తననే కట్టుకున్నందుకు బాగానే అయింది. ఎంతెంత వేసి నాయుళ్లూ గైరికేసి కళ్ళప్పలించేవోళ్లు. సై అంటే గైరిని అందలాల్లో మెట్టి పూజించివుందురే! తనని కట్టుకోని గైరి ఏం బావుకుంటున్నాది?'

''చిమ్మన్నా...యీడ ... తల్లిముండా ... సత్తా వుంటేని...''

''ఏటీ గుంటడు? ...అబ్బ ...'' నీరసంగా గైరి విసుక్కు-న్నది.

సిమ్మాద్రికి వుండబట్టలేదు. చివుక్కు-న లేచాడు. దణ్ణెంమీద్ది చింకిపంచె బుజానికి లాక్కు-న్నాడు. విసురుగా రెల్లుతడిక లాగాడు. వొంగిన పాళానేపోయి బయటపడ్డాడు.

''యాడకి?'' అడిగింది గైరి.

''ఏట్లోకి.'' చెప్పాడు. పోతూనే చీకట్లో

ST. JOSEPH'S GIRLS' HIGHER SECONDARY SCHOOL, GUNTUR.

మునిగిపోయాడు.

తడిక కంతలోనించి చలిగాలి బోఁయ్యిన పోసుకొంటోంది.

గైరి లేవబోయింది. కాని లేచిందికాదు. కళ్లు తిరిగాయి.

సందెట్లో పిల్లగాడు నేలమీదికి దొర్లి గీఁ మన్నాడు. గైరి కళ్ళుమూసుకున్నది.

◆ ◆ ◆ ◆

చీకట్లో అక్కడ మునిగిన సిమ్మాద్రి — సంజ దీపపువెల్తుర్లో కోమటిగుర్నాధం దుకాణం ముందు తేలాడు.

అంతకుముందే గుర్నాధం సంజదీపం వెలిగించి, దీపంముందు ఓ చీమతలకాయంత బెల్లపుముక్క పెట్టాడు. దానికి ఎదురుగ్గా కూచుండి ధ్యానంలో పడ్డాడు. ఆశాస్త్ర సేపట్లోనూ ఎవరేనా దుకాణం దొంగిలిపోకుండా ఆత్మను దుకాణంమీద కేంద్రీకరించాడు. ఐనా ఎలాబోయి ఎలా వచ్చునో అని మధ్య మధ్య కళ్లు తెరుస్తూ మూస్తూ వున్నాడు. ధ్యానం పూర్తయి, రెండు లెంపలూ గట్టిగా వాయించుకుని, గభీమని యీ మిథ్యా ప్రపంచంలోకి దూకేశాడు.

కుచ్చిరిచాటున క్రీనీడలో మొద్దాలెనుల్చున్న

సింహాద్రి హఠాత్తుగా కన్పించేసరికి గుర్నాథం గుండె గతుక్కుమన్నది.

"ఎవరదీ?"

"నేనండి చిమ్మణ్ణి."

"ఓరి దొంగనంజకొడకా! పలకవేటిరా?"

"మూన్నాల్లాయి. యింత సల్లంది తాగి—"

"అయితే నన్నేటి దానంచేసుకోమంటావు?"

"ఉత్తినే యేటండి. దినామూ అమ్మిని నావ గడిపేవాణ్ణి"

"ఏటి మారాజు....ఓలమ్మో!"

"ఏటెపొద్దుగూనా మీసేవ జేసేవోన్ని. మల్లా సెయ్యి మెసిల్నాక యిచ్చుగుంటాను. ఓ కుంచీడునూకలు సెంగున పోత్తిరాంశె—"

"కుంచీడుగాదు. సిట్టెడు కూడా దొరికేదిలా–నేనేటి పోగోసుకున్నానా?"

"బాబ్బాబ్బాబు–"

"అసలు సంజెవేళ నాచేత అబద్ధమాడించాల నేటా?– ఎన్నడూ అడగనోడివి అడిగేవే గనుక ఓ పొగాకుతునక నోట్లోయేసుకో – పెడ్తాను."

"మూన్నాల్లుగా సల్లంది తాగించేలేదు.. యిం

పెల్లపాది కటికిపస్తులు. ఏరు బుసలుగొడ్తా పొంగి పడ్తాండె. నావ కదిపిందెలేదు. కాని డబ్బు సేతులో పడిందెలేదు.''

గుర్నాథానికేదో గుర్తుకొచ్చింది.

''ఒరె సిమ్మన్నా! ఏరు తీసినాదేకాదట్రా?''

''ఏటి తీయడంబాబూ! ఎగవన వోరికొంపలు తీసినాదో! కొంపలకి కొంపలు, మంచాలు మాకులు దుంగలు దూలాలు గుణ్ణమేసి కూల్చుకొస్తన్నాది.''

''ఓరి నీయెర్రిగాల—నీబుర్రేటిజేసురా! సిత్తడి కాలం. పుల్లబుడికీ తడిసి పెద్దపెద్ద నాయుల్లె అల్లాడుతున్నారె. యీ పొద్దంతా నాయుడోరు, పొయ్యికట్టెలకు యాపగిస్తానేవుండ్రి—ఆరినీ యీరినీ యాచిచ్చకపోతే,ఏట్లోపడి వూరికేబోయేసరుకు ఒడ్డుకుపట్టిస్తె ఎంతడబ్బానురా.''

''ఓలమ్మో! తీయడమే. నేనుగాని—తీసినాక నాయుడు బారికాళ్ళని పంపి నూకుపోడు?''

''నీకాడ అంతె మరి. నేనుగాదు సొమ్ము జేసేది.''

''అట్టనే సేద్దుం కానీండి.''

''ఎప్పుడ్రడ యింక? యీ రేత్తికి రేత్తిరే దిగక—''

''అయ్యోవ్. ఏరు ఎట్ట పరవళ్లు తొక్కుతున్నాది;—''

“అదేర మీతో వచ్చినాది. ఏరు తీసినాళ ఒక్క పుల్ల వుంటాదిర?”

“యీ వుమ్మరంలో నావల్ల నేటీకాదు బాబు”

“ఏటి డొంకులు డొంకుతావుర. నిన్ను నేను ఎరగనూ! కాలుసేతులు గట్టి వరదలో యిద్దగిని పారేస్తే అద్దరికెల్లినవాడివిగాదుర - అది సూసేకాదు, మారాజుల్ని మన్నెమూకుల్లు సేసి గైరి నీయెంట బడ్తాది. లేక పోతే నీబుర్రకి గైరి దక్కిందే-!”

“అట్టనే - రేపు సూద్దంలెండి.” సిమ్మాద్రి వెనకటి అనుభూతుల్లో పడబోతున్నాడు.

“రేపేటి నీమొగం. వూరంత యెగబడినాళ నీకు ఒక్క పుల్ల దక్కేన్రా? రేత్రికి రేత్రె వొల్లొంచి తెల్లవార్లు తీసి పోగేస్తనను. మూడుకుంచాలు నూకలు. యిప్పుడే కొల్చుకో-

“.........”

“ఏటిర? మొద్దాలె వలకవు.”

“ఏటాశ బాబూ! తెల్లార్లు తీసిన కర్రకి మూడుకుంచాలల్ల కొలిశేని?”

“రేపు వూరంతా ఎగబడినాళ నాకాడమాత్రం ఎవరు కొంటార్రి? కడాకి ఒకటేమాట. మూడుకుంచాల్నూకలూ రెండురూపాయలు యిస్తా. యిష్టముంటే

నూసుకో. లేకుంటే పల్లక పో.''

''యింకోరూపాయి సేసుకోండి.''

''ఓ రేయ్. అన్న దేటో అనేశినాను. అబద్ద మాడిచ్చెశ.''

"నీనుమాత్రిం ఏమంత అడిగేను- ఆబళ్ళ-టీ-"

''సరిగ్గా తూచి అన్నాను. యింక దమ్మిడీ మిగిల్నా నష్టమేఅనుకో- ఏటి? నూకలుకొల్చేన ?''

''ఏటిశేస్తం? కొలవండి.''

''యీపొద్దీ నూకలుకొల్సుకో. డబ్బు రేపు-''

''సారవనై తే యిట్టే అరిగిపోను. చిట్టెళ్లు కొలవండి.''

—సింహాద్రి ఆ నూకల్లోనే కాసిన్ని కాసిన్ని పోసి ఉప్పుమిరపకాయ, అవీ, యివీ మూటగట్టుకున్నాడు. రెండు అంగల్లో కొంప చేరుకొన్నాడు.

అన్నీ అయి కాలేకడుపుల కింత గంజిపోసి సొద చల్లార్చుకునేసరికి రెండు జాములపొద్దుపోయింది.

చిటాపటా చినుకుల్లోకి సన్నగిల్లింది వాన. కురిసికురిసి తెల్లబోతున్నాయి మబ్బులు. ఆ మబ్బుల అంచుల్ని దాటుకుంటూ,. మసగమసగ్గా తెరలు తెరలుగా దిగుతోంది వెన్నెల.

తినక తినక తినడంతో కాళ్లూ చేతులూ తీసుకు పోతున్నాయి సిమ్మాద్రికి. అయినా తప్పదుమరి. కడుపుకు తిన్నవాడు ఎరగడూ? అలాగే బయటికివచ్చి ఏటి ఒడ్డునే నిలబడి ఏటికేసి చూస్తున్నాడు.

మిగతా ప్రకృతంతా నిశ్శబ్దంగావుంది. ఏరు మాత్రం 'ఝూఁ'మ్మని ఘోష పెడ్తోంది. ఒడ్డుల్ని పడద్రోసి, ప్రపంచాన్నే మ్రింగి, తనగర్భంలో విలీనం చేసుకోవాలన్నంత దాహంతో క్షణ క్షణం పైకుబుకుతోంది. చాచిన అలలతో ఆ దరీ యీ దరీ ఒరుసుకొంటూ చప్పరిస్తోంది. ఉవ్వెత్తుగా లేచే అలలు ఒడ్డుల్ని ఢీ కొంటున్నాయి. విరిగి వెల్లకిలా పడుతున్నాయి. కోపంతో ఘూర్ణిల్లుతోంది నాగావళి. తనజైత్రయాత్రకు అడ్డుగా నిలబడ్డ ఒడ్డులతో తీవ్రంగా ఘర్షణ పడ్తోంది. మరింత బలంగా వచ్చి తాకుతోంది. ఆ తాకిడికి తాళలేని చోటల్లా ఆ ఒడ్డూ యీ ఒడ్డూ విరిగిపడుతూ 'గుభీ దభీ' మంటున్నాయి.

వెన్నెల వెలుగులు పడ్డ చోటల్లా-తిరుగుతోన్న సుళ్ళూ, కరుగుతోన్న అలలూ, పోతోన్న వేగం స్పష్టంగా కనిపిస్తోంది. ఏట్లో కొట్టుకొస్తోన్న ఇళ్ళకప్పులు వస్తూవస్తూనే ఎక్కడికక్కడే జారిపోతున్నాయి. ఎక్కడో దూరదూరాల్లో గోచరించే గుంజలు, దుంగలు, అన్నీ అంతలో వచ్చిపడి రెప్పపాట్లో ఎంతోదూరం వెళ్ళిపోతు

న్నాయి. గిరుకిన సుళ్లుతిరిగి అగాధాలలోపడి అదృశ్యమౌ తున్నాయి. ఎక్కడ తేలుతున్నారో!

'ఏమివేగం-ఎంతవేగం ?'

చెవుల్లో ఏటిఘోష, కళ్లముందు ప్రవాహ వేగం, చుట్టూ భయంకరమైన అర్ధరాత్రి నిశ్శబ్దం. సిమ్మాద్రిగుండె మొత్తబడింది.

అనంతకాలంగా నిత్యనూతననీ, వందలజనాన్ని తననావనీ గుండెలమీద ఉయ్యాలలూపుకొంటూ - గల గలా పాడుకొంటూపోయేతల్లి, నాగావళి-ఈరోజు వేయి బారలుచాస్తూ వేలకోరలు నూరుతూ కబళించడానికి ఉవ్విళ్లూరుతోన్నట్టుంది.

ఎన్నివరదలురాలేదు, పోలేదు. ఇంతకంటె మహా ప్రమాదాలు ఘటిల్లుమంటోన్న సమయాల్లో కూడా సింహాద్రి నిర్భయంగా దూకాడు. సునాయాసంగా బయటపడ్డాడు.

ఆతల్లి హృదయంలో ప్రతిచిన్నలోతూ సింహా ద్రికి ఆకళింపే. ఆమె అగ్రహంలో అనుగ్రహంలో ఎలా మసులుకోవాలో ఆ మెళుకువలన్నీ అతనికి కొట్టినపిండే.

ముసిల్ది కడుపు పట్టినంతా పట్టించి కదలకుండా తొంగుంది. పిల్లవాణ్ణి ముసలిప్రక్కలో దూర్చేసి ఆచెర నుంచి బయటపడ్డది గైరి. మొగుడికి తానూ తోడుం

టుంది. అలాగైతేనే గైరికి తృప్తి-

ఏటిఒడ్డున గోచీ మాత్రంగా నల్లరాతి విగ్రహంలా నిలబడివున్నాడు సింహాద్రి.

"అబ్బ! ఏటిచలి? నరాలు జివ్వున నాగేస్తన్నాది." అంటు సింహాద్రిని రాచుకొంటూ నిలబడ్డాది గైరి.

"నీవేలా? యీదురుగాలి. మంపు. జలుబు చేస్తాది. లోపటికిపో_"

గైరి కదల్లేదు. మారుమాట పలకలేదు. అతడి గుండ్రని బుజంమీద చెయ్యివేసి నిమురుతూ, అల్లాగే ఏట్లో - వచ్చేపోయే సరంజామా; తిరిగే కరిగే సుళ్లూ; పడేలేచే అలలూ, చూస్తూ నిల్చొంది.

సింహాద్రి అలాగే నిల్చుండి నిల్చుండి 'నల్లే లోపటికిపో' అంటూ గైరినుంచి వేరై ఒడ్డుమీదినించి మెల్లగా జారి నీళ్ళల్లో కాలుబెట్టాడు.

"అబ్బ! హుహుహు-హు-"

నిండామునిగితేగాని చలిదారిన చలిపోదు. గభీమని నీళ్ళల్లో బోర్లాపడి ఒక్కమునుగు మునిగాడు. ప్రవాహం ఊ నెట్టేస్తోంది. ఒడ్డుకు రెండుబారల దూరంలో నడుములోతు నీళ్ళల్లో నిలబడ్డాడు. దుంగల్ని పట్టే ఒడుపుకోసం చూస్తున్నాడు.

అరవై రెండు

పదిబారలు ఏటికి ఎదురు వెళ్లాడు, చూచాడు. ఇరవై బారలు దిగువకు పోయాడు, కాచాడు. పెద్ద మ్రానొకటి మీదికి దూకుతుంటే సర్రునజారి ఒడ్డునందుకున్నాడు.

ఒడ్డుమీద గౌరి - సూదంటురాతి ఆకర్షణకు అటూ యిటూ తిరిగే ఉక్కుముక్కలా, సింహాద్రి పోయినవైపుకల్లా పోతోంది.

సింహాద్రి ఒడ్డెక్కాడు. తలా మొఖం పిండుకున్నాడు. ఎగువకేసి ఏకదీక్షతో చూస్తున్నాడు.

గౌరి ఏవేవో, ఉపాయాలు చెబుతోంది-బయటికి. అపాయాలు ఆలోచిస్తోంది-లోలోపల.

“అరెరెరె” అంటూ ఎదురు పరుగెత్తి ఎగిరి దూకాడు. ఎక్కడో రెండుఫర్లాంగుల దిగువను తేలాడు. ఓ పట్టు గుప్పెడు బడితె నొకదాన్ని బుజాన వేసుకుని గులుకు పరుగుమీద వచ్చాడు. బడితె నక్కడ పడేసి మళ్ళీ ఎగువకు పరుగెత్తాడు.

ఎంతో ఎగువకు పరుగెత్తుతున్నాడు. ఏట్లో దూకుతున్నాడు. ఎంతో దిగువను ఒడ్డు ఎక్కుతున్నాడు. దొరికినప్పుడు ఏ గుంజనో, ఏ కర్రముక్కనో తెస్తున్నాడు. దొరకనప్పుడు ఏదీ లేదు. ఫలితం ఏమైనా ఎగువా దిగువా పరుగులూ; ప్రవాహవేగానికి ప్రయాసపడ్డం; తప్పేదేమీ

లేదు. తడవతడవకూ అలుపు ఎక్కువతోంది. రోజుతున్నాడు. రొప్పుతున్నాడు. అలాగే పరుగెత్తుతున్నాడు. యీదుతున్నాడు. అన్ని మెళుకువలూ అంతశక్తీ వినియోగిస్తున్నాడు. మూడుగంటలుగా పడ్డశ్రమనీ కళ్లతో పోల్చి చూచుకోవాలంటే—

ఒడ్డున—నాలుగైదుదాకా గుంజలూ, ఒకటో రెండో మొద్దులూమాత్రం పడివున్నాయి.

యీకట్టెలకోసం తానుఎంత శ్రమపడ్డాడో గుర్నాథానికేం తెలుస్తుంది? అసలు ఎందుకు తెలియాలి? అతనికి కావలసింది - అక్షరాలా అక్కడ పడివున్నకర్ర; ఆకర్రని అమ్ముకుంటే రాగలలాభం; అదీ తానుయిచ్చిన నూకలకీ యివ్వబోయేరూకలకీ యిబ్బడిముబ్బడిగా వుండడం. యిదే! ప్రపంచం తిరగడమే యీసూత్రం చుట్టూ—

సింహాద్రికి ప్రాణం వుసూరుమనిపించింది పట్టుదల హెచ్చింది. యీసారిపోయి కాలుకుదిరినచోటు జూసుకుని నిలబడ్డాడు. వచ్చిన ప్రతిదాన్నీ పట్టుకోవాలనే ప్రయత్నంలేదు. ఒకేచోట నిలబడ్డాడు. తనదగ్గర కంటా వచ్చిన ఏపుల్లనేనా పట్టుకొంటే పట్టుకొంటాడు. "హైరే! నే, నే, నే—" అంటూ అక్కడినించే గిరవాటు పెడ్తాడు. పడెనా, అది ఒడ్డునపడ్తుంది.. తన గంజి క్రిందకేనా వస్తుంది. పడదూ? ఏట్లోనేనా కొట్టుకు

పోతుంది... యిలా సాగుతోంది, అనేకం ఒడ్డున వద్దు
న్నాయి. కాని...

"ఆఁ! రా-రా-"

ఓ పెద్ద మొద్దు వచ్చి పడ్తోంది. సిమ్హాద్రి
మీదికే దూకుతోంది. గైరిప్రాణం గుటగుటలాడింది.

"అల్లా - అల్లా" సుళువుగా తప్పుకున్నాడు.
ఒక్క నెట్టుతో వేగపు జాలుతప్పించాడు. ఆనుకొని
అలాగే వచ్చాడు. మరో రెండుమార్లు జాల్లుమార్చాడు.
ఒడ్డు పట్టించాడు.

సుళువుదిక్కి పాటున పడాలేగాని ఎంత పెద్ద
మానైనా నీళ్ళమీద ఏపాటి?

"ఓలె గైరి! సూసినావా? చిమ్మన్నంటే- హేఁ!"
సింహాద్రికళ్ళల్లో విజయగర్వం తొణికిసలాడింది.

"ఓలబ్బా! నేనెరగనోటి కొత్తచిమ్మన్న-"
పరాచికమాడింది గైరి.

తిరిగీ సింహాద్రి తనపనిలో పడ్డాడు. మరోటి
ఒడ్డుచేరింది. యింకోటి-యింకా...

"ఏళలపలడిటీ వోసి కర్మంకాలాదో!" నాగా
వళీతల్లి అడితీముత్తాన్ని అందిపుచ్చుకున్నట్టున్నాది. వరుస
వరుసగా వచ్చిపడుతున్నాయి. చీలిపోతున్నాయి.

సింహాద్రి చాలా జాగ్రత్తగా కాచాడు.

ఎక్కినాప్రమాదమే. అందుకనే ప్రతిదానిమీదికీ ఎగబడటంలేదు.

రెండుదూలాలు. జంటగావస్తున్నాయ్. అందు చాపులోకే వస్తున్నాయ్. ఒక్కఊపులో జాలుతప్పించ గలిగితే -! లేకుంటేపోయి సుడిగుణ్ణంలోకిజారతాయి.

ఒక్కక్షణంలో. పైకెగిరి నీళ్లమీద తేలాడు. బలంగా నెట్టేందుకు యిబ్బడిఓపికతో చేతులుపైకెత్తాడు. ఆ మొద్దుమీదపడబోతున్నాడు.

తాచు. పడగెత్తిన తాచు. ప్రాణభయంతో దూలాన్నిచుట్టుతూ బుసలుకొడ్తోంది.

''సచ్చిపోనానె - గైరీ'' పిచ్చికేకపెట్టి విరుచుకు పడ్డాడు.

''ఆఁ...'' గైరి గావుకేకపెట్టింది.

సింహాద్రి మరోబారెడులోపోయి సుడిగుండంలోపడ్డాడు. అందుకే వెర్రిబలంతో ఒడ్డువేపుకుపోయా లని తలపైకెత్తాడు.

దూలం తాకిన తాకున కణత ఎగిరిపోయింది. అతనుపెట్టిన కేక నాగావళీ గర్భంలో దాగిపోయింది.

గైరి ఒడ్డునపరుగెత్తుతూ కళ్లతో ఏరంతా గాలిస్తోంది. కనబడ్డప్రతిదాన్నీ సిమ్మాద్రేనని పరికిస్తోంది. ఏదోతెలియని భయంతో తోచనిబాధతో అటూయిటూ పరుగులెట్టబోతుంది. కాళ్లాడక కూలబడుతోంది. తెల్ల

వాళ్లా అలా ఏడ్చిఏడ్చి తెల్లవారేసరికి ఎక్కడో దూరాతి దూరాల్లో పిచ్చిగా తనప్రాణాన్ని దేవులాడుకొంటోంది.

తెల్లవారి ఝాముప్రొద్దెక్కేనాటికి – ఎవరికో తొలిసారిగా కన్పించాడు సింహాద్రి. మైలు దిగువను, ఏటుమలుపులో రెల్లుదుబ్బుల్లోకి తోసేసి తనదారినే తాను వెళ్ళిపోయింది నాగావళి.

గైరి కిది తెలియదు. నిరాశచేసుకొని కాళ్లీడ్చుకుంటూ గుండెలుబాదుకొంటూ కొంపకుచేరుతోంది.

పాకముందు జనం గుంపులు గుంపులై చూస్తున్నారు. ముసిల్ది సింహాద్రిమీద అలాగే పడిపోయింది. ఏడుపు గొంతులో బిగుసుకుపోయి, చేతులతో ఊ తడువుతోంది కొడుకు దేహాన్ని.

పాకలో చింకిగోనెమీద మురికిదారంలా గిలగిలా తన్నుకుంటున్నాడు చంటాడు.

గైరి వచ్చీరావడమే శోకవృక్షంలా విరుచుకుపడింది. తల నేలకేసి బాదుకొంటోంది.

సింహాద్రికేమీ? అతగాణ్ణి కాల్చడానికి అతడు పోగెట్టుకున్న కట్టెలేవున్నాయి. పిండంవెయ్యడానికి రాత్రి తెచ్చుకున్న నూకల్లో యింకా శేరుదాకా మిగిలే వున్నాయి.

'ఎంతమంచి జల్మ, ఎన్ని అవస్థలుపడితే ఏటిగనక ...చచ్చేనాటికూడా మరోళ్లకి కట్టెలేనా ఋణపడ

కుండా పోగొట్టుకుమరీ ప్రాణంవదిలాడు’ అనుకొంటున్నారు జనం.

అవతల వల్లకాట్లో చితిపేరుస్తోంటే-యివతల గుర్నాధం కడుపు చితిలాగానే మండుకుపోతున్నది.

‘శాబుణాం - నాబుణాం - నామూడు శేర్లనూకలూ’ అనుకుంటూ లోలోపలే పిసుక్కు-పిసుక్కు చస్తున్నాడు. గుర్నాధం.

ఆసమయంలో బయటికి అంటే-ఆజనమంతా ఎక్కడ వుస్తారో తోచకా - అనకపోతే మూడుశేర్ల నూకలూ వసూలయ్యేదారి అందకా –